క్లుప్తంగా

నేడు బుట్టాయగూడెంలో ఆసరా చెక్కుల పంపిణీ

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆసరా 3వ విడత చెక్కులను పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పీఏసీఎస్ మహాజన సభ



మక్కినవారిగూడెంలో నిర్వహిస్తున్న మహాజన సభ

టి.నరసాపురం : సహకార సంఘాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పటిష్టపరిచిందని మక్కినవారిగూడెం సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. సహకార సంఘం ఆవరణలో సోమవారం జరిగిన సంఘ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని వివరించారు. రైతులతో నిత్యం అనుసంధానంగా ఉండే సహకార సంఘ వ్యవస్థను ఈ ప్రభుత్వం పటిష్టపరిచిందని రైతులకు ఎంతో మేలు చేస్తోందని అన్నారు. సమావేశంలో సంఘ పర్సన్‌లు, దాసరి రాంబాబు, మందలపు మూర్తి, సంఘ మాజీ చైర్మన్ ఆచంట సూర్యనారాయణ, సీఈవో ఈవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కొలువై పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ తల్లి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భౌమరాజు సత్యనారాయణ రాజు, గిరిజ దంపతులు, పుసులూరి శ్రీహరిరావు, పరిపూర్ణ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన మండపారాధన, గోపూజ, వాస్తు హోమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు పాల్గొన్నారు.

స్పందనకు 5 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు చిత్తశుద్ధితో పని చేసి పరిష్కరించాలని ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అధికారులు వారి పరిధిలో వచ్చిన స్పందన సమస్యలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ నిర్వహించి పరిష్కారాలు చూపాలన్నారు. కాగా సోమవారం నాడు స్పందనలో 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి



గిరిజన సంప్రదాయ కొమ్ములు ధరించి నినాదాలు చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ గిరిజన సంఘం ఆదివాసీ జాతీయ అధికార మంచ్ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. గిరిజన సంఘం జిల్లా మహా సభల సందర్భంగా జీలుగుమిల్లి రైస్‌మిల్ గ్రౌండ్‌లో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఆదివాసీలకు అన్యాయం జరిగే పరిస్థితి ఉందని అన్నారు. ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, గిరిజన సంఘ నాయకులు తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు.

ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం : వాల్మీకి, బోయలను గిరిజన జాబితాలో కలపాలని చేసిన అసెంబ్లీ తీర్మానానికి వ్యతిరేకంగా ఈ నెల 31న జరిగే ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చెయ్యాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా ఆదివాసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరిస్తే నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుర్సం దుర్గారావు, ఏటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షులు సోడెం రాజు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు కృష్ణంరాజు, ఏఐకేఎంఎస్ నాయకులు కారం రాఘవ పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- ఆసరా చెక్కుల పంపిణీ



కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



చింతలపూడిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, డ్వాక్రా మహిళలు

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్క చెల్లెమ్మలకు రక్షాబంధన్‌గా నిలుస్తున్నారని, ఎల్లప్పుడూ ఆడపడుచుల సుఖసంతోషాలు, అభివృద్ధికై అన్నగా, తమ్ముడిగా, బిడ్డగా వారిని ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలరాజు ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ప్రజా ప్రతినిధులతో కలిసి చెక్కును మహిళలకు అందజేశారు. దీంతో మండలంలో 1551 సంఘాలకు చెందిన 15,013 మంది సభ్యులకు రూ.13.51 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఒక్కడిని ఓడించడానికి వందమంది కౌరవులు సిద్ధపడుతున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్జునుడై కుతంత్ర రాజకీయ పద్మవ్యూహాన్ని ఛేదించి ప్రతిపక్షాలను మట్టి కరిపిస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వెన్నుపోటుదారుల విజయంతో వాపును చూసి బలుపు అనుకుంటున్న తెలుగుదేశం పార్టీకి వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఘోరీ కట్టబోతున్నారన్నారు. కాగా అనారోగ్యానికి గురై అనంతరం మొట్టమొదటిసారిగా అధికారిక పర్యటనకు విచ్చేసిన బాలరాజుకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ప్రజా జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంతో పునరంకితం కావాలంటూ ఆశీర్వాదాలు అందజేశారు. థాంక్యూ ఎమ్మెల్యే సార్ అంటూ ప్రదర్శించారు. ఎమ్మెల్యేని పరామర్శించాలన్న ఉద్దేశంతో ఊహించిన దానికంటే డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పశ్చిమ డెల్టా బోర్డు చైర్‌పర్సన్ గంజిమాల దేవి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజలక్ష్మి, ఎంపీటీసీలు చింత శ్రీదేవి, ఘంటసాల సీనమ్మ, తేలే శ్రీనివాస్, జాన్ డేవిడ్ కింగ్, నారా అన్నపూర్ణాదేవి, బండి సీతారత్నం, మందపాటి కుమారి, సర్పంచులు సున్నం శాంతి కుమారి, కడకట్ల గడ్డియ్య, తదితరులు హాజరయ్యారు.

మహిళలకు బాసటగా వైఎస్సార్ ఆసరా

చింతలపూడి : కోట్లాదిమంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. స్థానిక వీకేఎం కళ్యాణ మండపంలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా పథకం వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నేతృత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే ఎలీజా, ఆయన సతీమణి ఉన్నమట్ల ఝాన్సీ రాణి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో బకాయి పడ్డ రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో మూడవ విడతగా 5,965 మహిళా గ్రూపులకు రూ.66.44 కోట్లు మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. 2014లో చంద్రబాబు డ్వాక్రా రుణాలను బేషరతుగా రద్దు చేస్తానని మహిళలను మోసం చేస్తే, పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ఆసరా పథకంతోపాటు పాటు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నియోజకవర్గంలోని మహిళలను ఆదుకుంటున్నారని అన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వార మహిళలకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్న మనసున్న మహారాజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అదే విధంగా దిశ చట్టాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు ఆసరా చెక్కును అందచేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, ఎమ్మెల్యే సతీమణి ఉన్నమట్ల ఝాన్సీ రాణి, నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎస్.వరలక్ష్మి, గుత్తా కిషోర్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, మండల యూత్ విభాగం కన్వీనర్ వెంపా కృష్ణ, ఆసుపత్రి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎం.దిలీప్, ఏపీఎం జ్యోతి, మహిళా సంఘం నాయకురాలు పార్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు ప్రసంగించారు.

జగనన్న పాలనలో ఆలయాలు పురోభివృద్ధి



మదన గోపాలస్వామి ఆలయంలో పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకి ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

కొయ్యలగూడెం : చంద్రబాబు నాయుడు తొమ్మిదేళ్ల పాలనలో ఆరువందలకు పైగా ఆలయాలు, రెండు వేలకు పైగా దేవతామూర్తుల మందిరాలు నేలమట్టం అయ్యాయని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆలయాలు పురోభివృద్ధి దశలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో నూతనంగా పునర్నిరించిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. సుమారు కోటి రూ.20 లక్షల వ్యయంతో 250 ఏళ్ల నాటి ఆలయ నిర్మాణం అధునాతనంగా పూర్తి చేసుకోవడంతో ఏజెన్సీ మెట్ట ప్రాంతవాసులకు గర్వకారణంగా నిలిచింది అన్నారు. ముందుగా పాలకమండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, మామిళ్ళపల్లి సుబ్రహ్మణ్య శర్మ వేదమంత్రాలతో ఆహ్వానం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేకి శాలువ కప్పి సత్కరించారు. అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, తోట జయబాబు, మందపాటి రామకృష్ణ, సర్పంచులు పసుపులేటి రాంబాబు, గేలం త్రివిక్రమ సోమరాజు, ఏలేటి చిన్న తుక్కయ్య, సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, టౌన్ ప్రెసిడెంట్ శంకు కొండ, చిక్కాల దుర్గాప్రసాద్, అడప సత్తిబాబు, శివాజీ గణేష్, మడుతోరి శ్రీను, కనికినేటి సత్యనారాయణ, చీమకుర్తి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



గాలికుంటు వ్యాధిపై పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారులు

కొయ్యలగూడెం : జాతీయ గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన వ్యాక్సినేషన్ కార్యక్రమం పోలవరం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పరింపూడి పశు వైద్య కేంద్రం వద్ద సోమవారం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పీఎన్‌వీ శేఖర్‌దొర కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 26,800 పశువులకు గాను 23,100 పశువులకు డోసులను వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

29న లేగ దూడల ప్రదర్శన

రాజవరంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏడాది వయసులోపు ఉన్న ఆవు లేదా గేదె దూడలను ఈ కార్యక్రమంలో రైతులు ప్రదర్శించవచ్చునని అన్నారు. ఇందులో గెలుపొందిన వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మెడికల్ కిట్లను నిర్వాహకులు అందజేస్తారన్నారు.

630 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో 630 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను సోమవారం ఉచితంగా వేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్ తెలిపారు. రైతులు గాలికుంటు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టీకాల కార్యక్రమం మండలంలో ఏప్రిల్ 24 వరకు నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. సర్పంచ్ ప్రత్తిపాటి మహాలక్ష్మాడు, మాజీ సర్పంచ్ పరసా వీర్రాజు, మాజీ ఎంపీటీసీ గుమ్మడి శ్రీను, పాడి రైతు కిలారపు రుక్మిణి నాథ్, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చింతలపూడిలో 100 పడకల ఆసుపత్రి భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

చింతలపూడి : పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి భవనాలను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రంలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రికి నిధులు కేటాయించి మెట్ట ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని అన్నారు. అనుకున్న సమయానికి ఆసుపత్రి భవనాలను పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు ఆసుపత్రి సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఆయన వెంట పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, కె.యువరాజు, ఎన్ దుర్గారావు, జైపాల్ ఎం.దిలీప్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పీఏసీఎస్ చైర్మన్ ఆతుకూరి సుబ్బారావును ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సోమవారం పరామర్శించారు. ఇటీవల సుబ్బారావు తండ్రి ఏలియ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఝాన్సీరాణి, పార్టీ నాయకులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పోలవరం రూరల్ : మండలంలో ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుమతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బొరగం వెంకటలక్ష్మి మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ అకాల వర్షాలకు రైతులు పెద్ద ఎత్తున పంటలు కోల్పోయారన్నారు. పొగాకు, మొక్కజొన్న, వరి, అపరాలకు ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు కరిబండి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

టి.నరసాపురం : వ్యక్తిని గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.నతీష్‌కుమార్ తెలిపారు. ఈనెల 23న టి.నరసాపురం ఇందిరా కాలనీకి చెందిన పూరేటి ప్రసాద్ తన ఇంటి సమీపంలో గొడవ జరుగుతుండటంతో సర్దిచెప్పడానికి వెళ్లాడు. ఈ క్రమంలో తాడిగడప కిషోర్ అనే వ్యక్తి నీకు సంబంధం లేని గొడవకు నువ్వు ఎందుకు వచ్చావు అంటూ ప్రసాద్‌పై కర్రతో దాడి చేయగా అతని తలకు గాయమైంది. చుట్టుపక్కల వారు ప్రసాద్‌ను 108 వాహనంలో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీలో విద్యార్థుల ప్రతిభ



ఫైనల్స్‌కు అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సాక్షి మీడియా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న సాక్షి – స్పెల్‌బీ 2022, మ్యాథ్స్‌బీ 2022లో ప్రతిభా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్పెల్‌బీ 2022లో ఇద్దరు విద్యార్థులు, మ్యాథ్స్ బీ 2022లో నలుగురు విద్యార్థులు ఫైనల్స్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఈనె ల 28, 30వ తేదీల్లో జరిగే ఫైనల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. 28న జరిగే మ్యాథ్స్ బీలో కేటగిరి–3లో కె.సూర్యప్రతాప్‌రెడ్డి (10వ తరగతి), వి.ధర్మ దినేష్ (7వ తరగతి), కేటగిరి–2లో వై.జస్వంత్, ఎ.హేమవెంకటమణికంత (4వ తరగతి), 30న జరిగే సాక్షి స్పెల్‌బీలో కేటగిరి–1లో ఎ.గీష్వంత్ (2వ తరగతి), కేటగిరి–3లో వై.భీమ గంగాధర్ (7వ తరగతి) హాజరవుతారని సరోజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మొమెంటో, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

అంతిమయాత్రలో.. ఆ నలుగురు



అప్పలనాయుడు అంతిమయాత్రలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

జంగారెడ్డిగూడెం : ఒక వ్యక్తి చనిపోతే కైలాస భూమి వరకు వెళ్లేది ఆ కుటుంబ సభ్యులో లేదా కొందరు మిత్రులను మనం చూస్తుంటాం. కానీ కేతిరెడ్డి అప్పలనాయుడు అనే వ్యక్తి అంతిమయాత్రలో భవననిర్మాణ కార్మికులు, ఇతరులు అనేకమంది పాల్గొని ఆయనపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కేతిరెడ్డి అప్పలనాయుడు భవన నిర్మాణ కార్మికుడిగా జీవన ప్రయాణం మొదలుపెట్టి ఒక్కోమెట్టు ఎక్కుతూ ఆ రంగంలో రాణించారు. కాంట్రాక్టర్‌గా, బిల్డర్‌గా ఎదిగి సుమారు వందలాది మందికి ఇదే రంగంలో ఆయన ఉపాధి కల్పిస్తున్నారు. కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందుండి చేయూతనందించే అప్పలనాయుడు ఇన్నేళ్లల్లో ఎంతో మంది అభిమానాన్ని సంపాదించారు. ఆదివారం జంగారెడ్డిగూడెం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పలనాయుడు మృతి చెందడంతో భవన నిర్మాణ కార్మికులు శోకసంద్రంలో మునిగిపోయారు. సోమవారం ఉదయం జరిగిన కైలాస యాత్రలో సుమారు 2500 మంది పాల్గొని దాదాపు 2 కిలోమీటర్ల మేర జనం ఆయన మృతదేహం వెంటే శ్మశానం వరకు వెళ్లి తుది వీడ్కోలు పలికారు.


రాముని గట్టు ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న తపన చౌదరి, అనఘానంద స్వామి తదితరులు

చింతలపూడి : మండలంలోని యర్రగుంటపల్లి, మక్కినవారిగూడెం గ్రామాల మధ్యన రాముని గట్టు శ్రీరామ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో నిర్మించిన నూతన కల్యాణ మండపాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఏలూరు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన), రామయ్యపాలెంకు చెందిన అనఘానంద స్వామి పాల్గొన్నారు. తొలుత రాముని గట్టు కొండపైన వెలసిన శ్రీ రాముని ఆలయం, శివాలయాలను గారపాటి సీతారామాంజనేయ చౌదరి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన, విశిష్టత కలిగిన రాముని గట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతుగా రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు సత్యనారాయణ శాస్త్రి, ఉపాధ్యక్షులు పద్మనాభ శాస్త్రి, శ్రీధర్, కోశాధికారి సోమశేఖరాచార్యులు, పిన్నమనేని రాము, మక్కినవారిగూడెం సర్పంచ్ మెతుకుమిల్లి గోపాలరావు, తుల్లిమెల్లి చిన కుటుంబరావు, పాములపాటి రాజశేఖర్ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు తొమ్మిది మంది జాతీయ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించారని హెచ్‌ఎం గెడా జగ్గారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గత ఏడాది తమ పాఠశాల ఏలూరు జిల్లాలో అత్యధికంగా 7 స్కాలర్‌షిప్‌లు గెలుచుకుందని, అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా పిల్లలను ప్రోత్సహించగా 9 మంది స్కాలర్‌షిప్‌లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించిన విద్యార్థులు బి.గీతిక, కె.నిధి, పి.సింధు రమ్య, ఎ.నైసీ, డి.వేద్య శ్రీ సత్య నాగబాల, కె.సాత్విక, ఎ.యశ్వంత్ పవన్‌సాయి, ఎండీ ఆలీ, కె.శరత్ మధు కార్తీక్‌లను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కట్టా శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచార జాత

ద్వారకాతిరుమల: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారజాత నిర్వహించారు. అందులో ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.జీవరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, తిమ్మాపురం, ద్వారకాతిరుమల గ్రామాల గుండా సాగిన కళాజాతలో వారు ప్రసంగించారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన మహిళల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

బుట్టాయగూడెం : మండలంలోని మర్రిగూడెం సమీపంలో ఎల్‌టీఆర్ భూములకు సంబంధించి తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పూనెం పార్వతి మాట్లాడుతూ 1/70 పరిధిలో ఉన్న ఎల్‌టీఆర్ భూములను తుప్పలు, కొండగట్టును నరికి చదును చేసి సుమారు 25 గిరిజన కుటుంబాల వారు ఫలసాయాన్ని 20 సంవత్సరాలుగా అనుభవిస్తున్నామని చెప్పారు. అయితే ఎల్‌టీఆర్ భూములపై గిరిజనేతరులు అక్రమంగా చొరబడి మా హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తగు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా గిరిజన మహిళలు ధర్నా చేస్తున్న సమయంలో అక్కడికి చేరుకున్న సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.జయబాబు గిరిజన మహిళలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు పాయం బేబి, పాయం భూలక్ష్మి, బుద్దుల గంగాదేవి, పలువురు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

పోలవరం రూరల్ : బోయ వాల్మీకిలను, బొంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తహసీల్దార్‌కు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ తీర్మానం వల్ల గిరిజన ప్రజలు నష్టపోతారని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.